క్లుప్తంగా

అంకితభావంతో పని చేసినప్పుడే గుర్తింపు



పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసినపుడే విద్యార్థుల గుండెల్లో చిరస్థాయిగా ఉంటామని ఆదోని మండల విద్యాధికారులు భూపాల్ రెడ్డి, శ్రీనివాసులు పెద్దకడబూరు మండల విద్యాధికారి రామమూర్తి తెలిపారు. పురపాలక ఉన్నత పాఠశాలలో ఇటీవల పదవీ విరమణ పొందిన వ్యాయామ ఉపాధ్యాయుడు నరసయ్యను ఆదివారం ఏపీ పీఈటీ మరియు ఎస్‌ఏ పీఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జోసఫ్ లక్ష్మయ్య, నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఫయాజ్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు ఈరన్న గౌడ్, హనుమంతు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ హనుమంత రెడ్డి

కోసిగి: వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు భద్రత నియమాల పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఎస్‌ఐ హనుమంత రెడ్డి సూచించారు. ఆదివారం కోసిగి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రయాణికులకు, వాహనదారులకు అవగాహన కల్పించారు.ఆయన మాట్లాడుతూ అనుమతులు లేని వాహనాలు నడపరాదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకుని ప్రాణాలతో చెలగాటం ఆడరాదని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆదోని రూరల్: మండలంలోని నాగనాథనహళ్లి గ్రామంలోని హెబ్బటం రోడ్డులో లక్ష్మమ్మ వంక వద్ద పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్‌ఐ డాక్టర్ నాయక్ ఆదివారం తెలిపారు. ఇందులో నాగనాథనహళ్లి గ్రామానికి చెందిన నాగరాజు, హనీఫ్, ఆనంద్, యల్లప్ప, విష్ణుచరణ్, సలీమ్‌బాషా, మహబూబ్ బాషా, అహ్మద్‌లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.16,100 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రం మంత్రాలయ పుణ్యక్షేత్రంలో తుంగభద్ర నదిలో మునిగి కర్ణాటక రాష్ట్రం హాసనకు చెందిన ముగ్గురు భక్తుల కుటుంబాలని ఆదుకోవాలని ఏఐవైఎఫ్, ఎంఆర్‌పీఎస్, సీపీఐ నాయకులు రాజు, చిక్కం జానయ్య, భాస్కర్ యాదవ్ కోరారు. ప్రభుత్వం, శ్రీమఠం అధికారులు బాధిత కుటుంబాలకు రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. అలాగే తుంగభద్ర నదిలో పోలీసు శాఖ, శ్రీమఠం అధికారులు కనీసం సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని, నది తీరంలో సెక్యూరిటీ కూడా లోపించిదని, భక్తులకు అవగాహన కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు రాజేష్, హనుమన్న తదితరులు పాల్గొన్నారు.

తల్లీకొడుకుల ఆచూకీ లభ్యం

కోసిగి: ఈనెల 9వ తేదీ నుంచి కనిపించకుండా పోయిన మండల పరిధిలోని జంపాపురం గ్రామానికి చెందిన కాపు ఉమాదేవి, ఆమె కుమారుడు యశ్వంత్ రెడ్డిల ఆచూకీ లభ్యమైంది. ఈనెల 11న కోసిగి పోలీస్ స్టేషన్‌లో తన కుమార్తె మనవడు కనిపించడం లేదని ఆమె తల్లిదండ్రులు నారాయణ రెడ్డి, జయలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ మంజునాథ్, ఎస్‌ఐ హనుమంతరెడ్డి ముమ్మరంగా గాలించి ఆమె తిరుపతిలో ఉన్నట్లు గుర్తించారు. ఆమెను, కుమారుడిని క్షేమంగా ఆదివారం తల్లిదండ్రులకు అప్పగించారు.

బనవాసి గురుకులం తనిఖీ



ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న ఎంపీ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి ఏపీ గురుకుల పాఠశాలను ఆదివారం సాయంత్రం జిల్లా ఎంపీ బస్తిపాటి నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల గదులను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడి ఏమైన సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో తాగునీటి సమస్య ఉందని, ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాలని, 7, 9వ తరగతులకు తెలుగు, బయాలజీ సబ్జెట్లకు ఉపాధ్యాయులు లేదని ప్రిన్సిపాల్ సామ్రాజ్యం ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఎంపీ మాట్లాడుతూ పాఠశాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పంటల బీమాపై గందరగోళం

- పంటల బీమా నమోదు చేసుకోవాలంటూ నాలుగు రోజుల క్రితం ప్రభుత్వ ప్రకటన
- రేపే ఆఖరు తేదీ
- బ్యాంకుల్లో ఇప్పటికి 60 శాతం పూర్తయిన పంట రుణాల రెన్యూవల్స్
- ప్రీమియం భారం రైతులపైనే
- పంటల బీమా నమోదుకు ఆసక్తి చూపని రుణాలు తీసుకోని రైతులు
- ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆగ్రహం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నదికైరవాడిలో పంటల బీమా నమోదు చేస్తున్న ఆర్బీకే సిబ్బంది (ఫైల్)

నందవరం: కూటమి ప్రభుత్వం ఆరు గాలం శ్రామించే అన్నదాతలను చిన్న చూపు చుస్తూనే ఉంది. రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడింది. ఖరీఫ్, రబీ ఆరంభం కాగానే కచ్చితమైన విధి విధానాలు, ప్రీమియం, కటాఫ్ తేదీలు ప్రకటించ లేదు. ఈ క్రమంలో పంటల బీమాపై రైతుల్లో గందరగోళం నెలకొంది. ఎటూ పరిహారం ఇచ్చేది లేదనే ఉద్దేశంతో చెలగాటమాడుతున్నట్లు కనిపిస్తోందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో అన్నదాతలకు ఇబ్బంది లేకుండా సాఫీగా అమలు చేసిన బీమా పథకంపై అంతులేని అలసత్వం ప్రదర్శిస్తూ చంద్రబాబు సర్కార్ రైతులను దారుణంగా మోసం చేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి..

మొక్కుబడిగా బీమా అమలు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విజయవంతంగా అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. ప్రీమియం చెల్లించాలంటూ రైతులపై అదనపు భారం మోపింది. ఏటా ప్రీమియం రూపంలో దాదాపు రూ.200 కోట్లు వరకు రైతుల నుంచి దండుకునేందుకు ఎత్తులు వేసింది. కానీ పరిహారం విషయానికి వచ్చే సరికి చేతులెత్తేస్తోంది. 2023 సంబంధించి 2024లో ఎగ్గొట్టింది. 2024 ఖరీఫ్ సంబంధించి పరిహారం ఇవ్వకుండా దాటవేస్తోంది. నేడు ఖరీఫ్ 2025 బీమా పథకం అమలులోకి తెచ్చింది. ఇలా పంటల బీమా పథకం ప్రయోజనాలు రైతులకు దక్కకుండా మొక్కుబడిగా మార్చేసింది.

ఈ నెల 15 వరకు పంటల బీమా ప్రీమియం చెల్లింపునకు అవకాశం

మండలంలో 13,116 మంది రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. వాతావరణ బీమా కింద చేర్చిన పంటలకు ఈ నెల 15వ తేదీ లోపు ప్రీమియం కట్టాలని వ్యవసాయ శాఖ నాలుగు రోజుల కింద ప్రకటన విడుదల చేయడం గమనార్హం. పంట రుణాలు తీసుకోని రైతులు ప్రత్యేకంగా కామన్ సర్వీసు సెంటర్లు(సీఎస్‌సీ), అలాగే నేషనల్ క్రాప్ ఇన్స్యూరెన్స్ పోర్టల్(ఎన్‌సీఐపీ)లో ప్రీమియం కట్టాలని సూచించారు. ప్రీమియం భారం రైతులపైనే ఉండటంతో నమోదు ఆసక్తి చూపడంలేదు. ఇప్పటి వరకూ మండలంలో 10 శాతం మాత్రమే పంటల బీమా నమోదైనట్లు తెలుస్తోంది. రైతుల సంక్షేమ పట్ల కూటమి ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఎంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయనడానికి ఇంతకన్నా నిదర్శన మేముంటుందనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

60 శాతం పూర్తయిన బ్యాంకు రెన్యూవల్స్

పంట రుణాల రెన్యూవల్స్ సమయంలో రైతుల నుంచి పంటల వారీగా ప్రీమియం కట్టించుకోవాల్సి ఉంది. కానీ కొన్ని బ్యాంకుల్లో ప్రీమియం కట్టించుకోలేదు. మరి కొన్ని బ్యాంకులు రైతుల నుంచి ప్రీమియం కట్టించుకుంటున్నా..ఏ పంటలకు కట్టించుకుంటున్నారో రైతులకే అర్థం కావడం లేదు. ప్రస్తుతం బ్యాంకులు పత్తి, వేరుశనగకు ప్రీమియం కట్టించుకోవడం లేదు. ఇప్పటికే బ్యాంకుల్లో రెన్యూవల్స్ 60 శాతం పూర్తి చేసినప్పటికీ ప్రీమియం చెల్లింపుపై స్పష్టత లేకపోవడంతో రైతుల్లో సందిగ్ధత నెలకొంది. అలాగే ఈ-క్రాప్‌లో వేరుశనగ, పత్తి పంటలు నమోదైతేనే బీమా పథకం వర్తిస్తుంది. వేరే పంట వేస్తే సాంకేతిక సమస్య ఉత్పన్నమవుతాయని చెబుతున్నారు.

12 రకాల పంటలకు బీమా వర్తింపు

ఖరీఫ్ పంటల దిగుబడులు ఆధారంగా ప్రధాన మంత్రి ఫసల్‌బీమా కింద కంది, వరి, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండుమిరప, కొర్ర, ఉల్లి పంటలకు బీమా పథకం వర్తింపజేశారు. ఇందులో వరి రైతులు ఎకరానికి రూ.80 ప్రకారం బీమా ప్రీమియం కట్టాల్సి ఉంది. ఎండు మిర్చికి రూ.360, కందికి రూ.44, ఉల్లికి రూ.90 చొప్పున ప్రీమియం చెల్లించాలి. ఇంకా వాతావరణ బీమా పథకం కింద వేరుశనగ, పత్తి, దానిమ్మ, బత్తాయి, టమాట, అరటి వర్తింపజేశారు. ఇందులో వేరుశనగ ఎకరానికి రూ.640, పత్తి ఎకరానికి రూ.1,140 ప్రకారం ప్రీమియం కట్టాలంటూ ఇటీవల వ్యవసాయ శాఖ ప్రకటన విడుదల చేసింది.

ఈ నెల 15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాలి



రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ఈ నెల 15లోపు పంటల బీమా నమోదు చేసుకోవాలి. రైతులకు రెండు రకాల బీమా ఇన్సూరెన్స్ ఉంది. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారికత బీమా పథకం కింద పంట బీమా నమోదు చేసుకోవాలి. ముఖ్యంగా వాతావరణ ఆధారిత బీమా పథకం కింద పత్తికి ఎకరానికి రూ.2,000, వేరుశనగ పంటలకు ఎకరానికి రూ.560 చొప్పున ప్రీమియం రైతులు చెల్లించాలి. కామన్ సర్వీసు సెంటర్లు, నేషనల్ క్రాప్ ఇన్స్యూరెన్స్ పోర్టల్(ఎన్‌సీఐపీ)లో ప్రీమియం చెల్లించాలి. – సరిత, ఏఓ, నందవరం

పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలి



ఖరీఫ్‌లో నేను పత్తి 6 ఎకరాల్లో పత్తి సాగు చేశా. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో పంటల బీమా ప్రభుత్వమే ప్రీమియం చెల్లించేది. ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగా పంట బీమా నమోదయ్యేది. ప్రస్తుతం ప్రభుత్వం రైతులకు అదనపు భారం మోపింది. రైతులే పంట బీమా ప్రీమియం కట్టాలని నిర్ణయించింది. మాలాంటి రైతులకు అదనపు భారం. కూటమి ప్రభుత్వమే పంట బీమా ప్రీమియం చెల్లిస్తే బాగుటుంది. – వీరస్వామి, రైతు, గురజాల

పంట బీమా గురించి అవగాహన లేదు

పంటల బీమా గురించి మాలాంటి రైతులకు అవగాహన లేదు. గతంలో రైతు భరోసా కేంద్రం అధికారులు వచ్చి వేలిముద్ర వేయించుకుని పంటల బీమా నమోదు చేసేవారు. ప్రస్తుతం ప్రభుత్వం పంట బీమా రైతులే కట్టాలని అంటుంది. మాలాంటి వారు ఎక్కడికి వెళ్లి కట్టాలో అర్థం కావడం లేదు. బీమాకు ఏవిధమైన ధ్రువపత్రాలు తీసుకోవాలి..ఎక్కడ కట్టాలో తెలియదు. వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించడం లేదు. పంట బీమా ప్రీమియం రైతుల వద్దకే వచ్చి నమోదు చేస్తే బాగుటుంది. – వీరేష్, రైతు

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



బుట్టా శివ నీలకంఠను సన్మానించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన వారు పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలని పార్టీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ సూచించారు. వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడిగా నియామకమైన వెంకటాపురం రాజు, ఎమ్మిగనూరు మున్సిపల్ విభాగం బీసీ కమిటీ అధ్యక్షుడు బోయబజారి, పార్టీ పట్టణ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా నియామకమైన గువ్వలదొడ్డి హుసేన్, డాక్టర్స్ విభాగం పట్టణ అధ్యక్షుడు మెహతర్ యూసుఫ్, బీసీ విభాగం కార్యవర్గ సభ్యుడు టీకే గౌస్, పట్టణ క్రిష్టియన్ మైనారిటీ అధ్యక్షుడు మంద్రి ప్రభాకర్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు మంద్రి శివ తదితరులు స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయనను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. తమకు పార్టీ పదవులు ఇచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుకకు ధన్యవాదాలు తెలిపారు. శివనీలకంఠ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం తేవాలని సూచించారు. అప్పుడే స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అన్ని స్థానాలు కైవసం చేసుకోవచ్చన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక ఎల్లప్పుడు పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహుడు, గోనెగండ్ల మండల అధ్యక్షుడు కెవీ.కృష్ణారెడ్డి, సాంస్కృతిక విభాగం జిల్లా నాయకులు కాశీవిశ్వనాథ్‌రెడ్డి, మైనారిటీ జిల్లా ఉపాధ్యక్షుడు మహబూబ్‌గేగ్, పట్టణ ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు ముల్లా రసూల్, అల్తాఫ్, నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు



నిరసన గళం ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకులు

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బోయ వాల్మీకి సామాజిక వర్గాన్ని మోసం చేస్తున్నాయని బోయ వాల్మీకి సమితి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు అంజి, శేఖర్‌నాయుడు, సీనియర్ నాయకులు వీజీఆర్ కొండయ్య, యాపీలయ్య ఆరోపించారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని ప్రకటించి విస్మరించడంపై ఆదివారం పట్టణంలో వాల్మీకి కమ్యునిటీ హాల్ కోసం కేటాయించిన స్థలం నుంచి బోయ వాల్మీకి సమితి ఆధ్వర్యంలో ర్యాలీగా బయలు దేరి సోమప్ప సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ వాల్మీకి బోయ సామాజిక వర్గాన్ని ఎస్టీ జాబితాలో చేర్చే దిశగా అడుగులు వేయడం లేదన్నారు. దీనిపై కూటమి కేంద్రం, రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వాల్మీకులను రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తామని కాలయాపన చేస్తున్నాయన్నారు. మోసపూరిత ప్రభుత్వాలను భవిష్యత్‌లో గద్దెదింపి బోయ వాల్మీకులకు రావాల్సిన హక్కులను సాధించుకునేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి సమితి నాయకులు జెట్టప్ప, శివరాజు, మహేంద్రనాయుడు, వీవీ నాయుడు, నాగరాజు, విష్ణు, వెంకటేష్, ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోర్ల విద్యుత్ వైర్లు చోరీ



విద్యుత్ వైర్లు లేని బోరు

గోనెగండ్ల: మండల పరిధిలోని బి. అగ్రహారం గ్రామంలోని తాగునీటి బోర్ల మోటర్లకు ఉన్న విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం దొంగలించారు. బి. అగ్రహారానికి తాగునీరు సరఫరా చేసేందుకు గ్రామ శివారులో నాలుగు తాగునీటి బోర్లు ఉన్నాయి. ఆదివారం వంకలో ఉన్న మూడు తాగునీటి బోర్ల మోటర్లకు సంబంధించిన విద్యుత్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. దీంతో గ్రామానికి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సర్పంచ్ రంగారెడ్డి, గ్రామస్తులు బోర్ల వద్దకు వెళ్లి చూడగా వైర్లు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో వారు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సమాచారం అందించారు. పరిశీలించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస రెడ్డి గ్రామానికి తాగునీటి సమస్య లేకుండా చూస్తామని తెలిపారు. ఈ విషయంపై సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామన్నారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకుందాం

కౌతాళం: విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు బిగించకుండా అడ్డుకోవాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సోమవారం జరిగే మహాధర్నాకు తరలిరావాలని కోరారు. ఈ మేరకు ఆదివారం కరపత్రాలను పంపిణీ చేశారు. సీపీఎం మండల కన్వీనర్ ఈరన్న, సీనియర్ నాయకుడు మల్లయ్య మాట్లాడుతూ ప్రస్తుతమున్న మీటర్లను తొలగించి వాటి స్థానంలో అదానీ కంపెనీ వారు తయారు చేసిన స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తున్నారని జాగ్రత్త ఉండాలన్నారు. మోసపూరిత మాటలు చెప్పి ఇళ్లకు మీటర్లు మార్చుతున్నారన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: స్మార్ట్‌మీటర్లపై పోరుబాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని తేరుబజార్, కర్నూలు బైపాస్ రోడ్ ప్రాంతం, తాయమ్మ కాలనీ, ముబారక్ నగర్, లక్ష్మిపేట, శ్రీనివాస సర్కిల్ తదితర ప్రాంతాల్లో సీపీఎం నాయకులు గోవిందు, రాముడు, రవికుమార్, రామన్న, వలి, హుసేన్, తదితరులు ఇంటింటికి వెళ్లి స్మార్ట్‌మీటర్లతో వచ్చే నష్టాలను ప్రజలకు వివరించారు.

గాయపడ్డ విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థిని తల్లికి నగదు అందిస్తున్న ఉపాధ్యాయుడు ప్రసన్నరాజు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మాచాని సోమప్ప జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని సువర్ణ ఇటీవల పాఠశాల నుంచి ఇంటికి వెళుతుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఆమె వైద్య ఖర్చుల నిమిత్తం ఉపాధ్యాయులు తమ వంతు సహకారం అందించారు. పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు ప్రసన్నరాజు తోటి ఉపాధ్యాయుల సహకారంతో సేకరించిన రూ.55వేలను ఆదివారం కర్నూలు ఆసుపత్రికి వెళ్లి విద్యార్థిని తల్లిదండ్రులకు అందజేశారు. ఆయన వెంట బాలికల హైస్కూల్ ఉపాధ్యాయిని అన్నపూర్ణ ఉన్నారు.

ఐఆర్ ప్రకటించాలి

ఆదోని సెంట్రల్: పీఆర్సీ అమలు చేయడానికి ఆలస్యం జరుగుతున్నందున ప్రభుత్వం స్పందించి పెరిగిన నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ఐఆర్ ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య (ఏపీఎంటీఎఫ్) ఆర్థిక కార్యదర్శి కోటన్న కోరారు. ఆదివారం స్థానిక ఓ హోటల్‌లో ఏపీఎంటీఎఫ్ ముఖ్య కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎంటీఎఫ్ అధ్యక్షుడు అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

15వ తేదీ లోపు పంటల బీమా నమోదు చేసుకోవాలి

మంత్రాలయం రూరల్ : రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు పంటల బీమా ఈ నెల 15వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జీరా గణేష్ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బీమా పరిహారం పొందేందుకు రైతు స్వచ్ఛందంగా పంట బీమా ప్రీమియం చెల్లించాలన్నారు.

హామీలను నెరవేర్చాలి

ఆదోని రూరల్: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణాధ్యక్షులు తిప్పన్న, ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు మూర్తి, కర్రెప్ప డిమాండ్ చేశారు. ఆదివారం వారు ఆదోని పట్టణంలోని పంప్‌హౌస్ వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలను నెలకు రూ.30 వేలు ప్రతి కార్మికుడికి ఇవ్వాలన్నారు. కార్మికులు మహమ్మద్, వీరేష్, బాషా, తిమ్మప్ప, లోకేష్, ఈరన్న పాల్గొన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి

ఆదోని రూరల్: అంగన్‌వాడీ ఆయాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కనీస వేతనాలను అమలు చేయాలని సీఐటీయూ పట్టణాధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, అంగన్‌వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటమ్మ, రూరల్ ప్రాజెక్టు కార్యదర్శి వరలక్ష్మి డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోని పట్టణంలోని తిరుమలనగర్‌లో జరిగిన అంగన్‌వాడీ వర్కర్ల సమావేశంలో వారు మాట్లాడారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షురాలుగా అపర్ణ, కార్యదర్శిగా విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలిగా వినోదమ్మ, కోశాధికారిగా నాగమణితో పాటు 13 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

సత్ప్రవర్తనతో మెలగండి

ఆదోని అర్బన్: సత్ప్రవర్తనతో మెలగాలని, చెడుదారిలో వెళ్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు హెచ్చరించారు. ఆదివారం స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నేర చరిత్ర, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని, మంచి జీవనాన్ని గడపాలన్నారు.

బీజేపీ, టీడీపీ వర్గీయుల ఘర్షణ

ఆదోని అర్బన్: పట్టణశివారులోని భరత్‌నగర్‌లో బీజేపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఆదివారం ఘర్షణ చోటు చేసుకుంది. బీజేపీ నాయకుడు వడ్డే రాముడు, టీడీపీ నాయకుడు లింగ్న ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుని ఒకరిపై ఒకరు దాడి చేసుకుని త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కల్లు డిపోలో వడ్డే రాముడు పనిచేస్తున్నాడు. టీడీపీ నాయకుడు లింగన్న ఇక నుంచి పని మానుకోవాలని వడ్డే రాముడికి తెలిపాడు. దీంతో వడ్డే రాముడు డిపోకు చెందిన వాహనాన్ని ఆపాడు. డిపో వాహనాన్ని ఆపినందుకు టీడీపీ నాయకుడు లింగన్న, బీజేపీ నాయకుడు వడ్డే రాముడు మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఒకరిపైఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ముస్లిం మైనార్టీలకు పెద్దపీట



పదవులు పొందిన నాయకులతో మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాజకీయంగా ఎంతో ప్రాధాన్యతనిస్తూ పదవులను కట్టబెట్టినట్లు వైఎస్సార్‌సీపీ ఆదోని నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయిప్రసాద్‌రెడ్డి నివాసంలో ముస్లిం వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర సెక్రటరీగా నాసీర్‌అహ్మద్‌ను ఎంపికైన సందర్భంగా సన్మాన కార్యక్రమం చేశారు. నాసీర్ సాయిప్రసాద్‌రెడ్డిని సన్మానించగా, ముస్లిం మైనార్టీలు, అభిమానులు నాసీర్‌ను సన్మానించారు. సాయిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆదోనిలో రాజకీయంగా ముస్లిం మైనార్టీలకు అవకాశం కల్పిస్తూ ఆర్థికంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎంతో అభివృద్ధిలోకి తీసుకురావడం జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే ముస్లింలకు రాజకీయ పదవులు ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి, షఫీఅహ్మద్, సునీల్ అబ్దుల్ ఖాదర్, అల్తాఫ్, న్యాయవాది తబరీష్, రిటైర్డ్ తహసీల్దార్ నియాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి విభాగం జిల్లా కార్యదర్శులుగా..

ఆదోని పట్టణానికి చెందిన వీరేష్, మంజునాథ్‌లను వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం కార్యదర్శులుగా ఎంపిక చేస్తూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. వారు మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డిని కలిసి శాలువాలతో సన్మానించారు.



ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డిని కలిసిన బూత్ కమిటీ మండల అధ్యక్షుడు త్యాగరాజు, గ్రామస్తులు

పార్టీ బలోపేతానికి కృషి

కోసిగి: మండలంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు తమ వంతుగా కృషి చేస్తానని బూత్ కమిటీ మండల అధ్యక్షుడు కందుకూరు త్యాగరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే స్వగృహంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, కోసిగి మండల ఇన్‌చార్జ్ పి. మురళీ మోహన్ రెడ్డిలను మర్యాద పూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలు వేసి సన్మానం చేశారు. తనపై నమ్మకం ఉంచి పార్టీలో బూత్ కమిటీ మండల అధ్యక్షుడిగా ఎంపిక చేయడంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.



పల్లెపాడు గ్రామ పొలాలల్లో సంచరిస్తున్న జింకలు

పంటలకు జింకల బెడద

కోసిగి: మండలంలోని చింతకుంట, పల్లెపాడు, డి.బెళగల్, సజ్జలగుడ్డం, దేవరబెట్ట, జంపాపురం, ఐరన్‌గల్లు, సాతనూరు, చిర్తనకల్లు, మూగలదొడ్డి గ్రామాల్లోని పంట పోలాలలో జింకలు విపరీతంగా సంచరిస్తున్నాయి. పంట పోలాలను జింకల బారి నుంచి కాపాడాలని రైతులు కోరుతున్నారు. ఇటీవల వర్షాలకు సాగుచేసుకున్న వేరుశెనగ , పత్తి తదితర పంటలను నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత ఫారెస్ట్ అధికారులు స్పందించి జింకలు పొలాలలో సంచరించకుండా ఫారెస్టుకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రైనేజీని శుభ్రం చేయండి



మురుగు కాల్వను చూపుతున్న కాలనీ వాసులు

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఎన్టీఆర్ కాలనీలో మురుగు కాల్వలు చెత్తతో నిండిపోయినా తొలగించడం లేదంటూ కాలనీ మహిళలు నాగమ్మ, సుంకులమ్మ, రాజేశ్వరి, లక్ష్మీలు ఆరోపించారు. డ్రైనేజీ కాల్వను చూపుతున్న మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. కాలనీ శివారు భాగంలో నివాసం ఉంటున్నామని, ఎగువ ప్రాంతంలోని డ్రైనేజీ నీళ్లన్నీ వచ్చి ఇక్కడే వచ్చి నిల్వ ఉంటున్నాయన్నారు. దీంతో దుర్వాసనతో పాటు దోమలు విపరీతంగా పెరిగి రోగాలకు బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా పంచాయతీ సిబ్బంది తమ కాలనీ వైపు కన్నెత్తి చూడడం లేదని ఆరోపించారు. సంబంధిత పంచాయతీ అధికారులు స్పందించి కాల్వలలో పూడిక తొలగించాలని కోరారు.